



జిల్లా ఓటర్లు..

ఎట్టకేలకు తుది ఓటర్ల జాబితా విడుదలైంది. స్పెషల్ సమ్మరి రివిజన్ - 2024లో చివరి అంకం పూర్తయింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలను జిల్లా యంత్రాంగం విడుదల చేసింది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఒక సాఫ్ట్, ఒక హార్డ్ కాపీలను అంద జేసింది. అలానే సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్‌లోనూ ఓటర్లకు అందుబాటు లోకి తీసుకొచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనందున ఇంకా ఎవరైనా ఓటు పొందలేకపోయి ఉంటే వారు కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. అలానే ఎవరైనా చనిపోయినా, చిరునామా మారినా సంబంధిత దరఖాస్తులను పెట్టుకోవచ్చు.

- మహిళా ఓటర్లే అధికం
- స్వల్పంగా పెరిగిన ఓట్లు
- పారదర్శకంగా రూపొందించామన్న కలెక్టర్
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేత
- ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో..

12,75,540

బాపట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ పూర్తయింది. బాపట్ల కలెక్టరేట్‌లో సోమవారం ఓటర్ల జాబితాను కలెక్టర్ పి.రంజిత్‌బాషా విడుదల చేశారు. తుది ప్రచురణలో జిల్లావ్యాప్తంగా ఉన్న మొత్తం ఓట్లు 12,75,540గా పేర్కొనగా ఇందులో పురుషులు 6,22,526 మంది ఉన్నారు. మహిళల వాటా 6,52,941గా ఉంది. పురుష ఓటర్లతో పోలిస్తే 30,415 మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్యలో 2,41,081 ఓట్లతో అద్దంకి ప్రథమస్థానంలో ఉండగా, 2,26,566 ఓట్లతో రేపల్లె రెండో స్థానంలో నిలిచింది. ఇక వరుసగా పర్చూరులో 2,25,770, చీరాలలో 1,98,643, వేమూరులో 1,95,756, 1,87,724 ఓట్లతో బాపట్ల చివరి స్థానంలో నిలిచింది. ప్రతి నియోజకవర్గంలోనూ పురుష ఓటర్లతో పోలిస్తే మహిళా ఓటర్లే ఆధిక్యంలో ఉండడం విశేషం.

ఓటర్ల పెరుగుదల స్వల్పంగానే..

ఎన్నికల ఏడాదిలో విడుదల చేసే ఓటరు జాబితాలో సహజంగా గణనీయంగా ఓటర్ల సంఖ్యలో పెరుగుదల నమోదవడం రివాజు. కానీ సోమవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తుది ప్రచురణలో ఆశించిన స్థాయిలో జిల్లాలో పెరుగుదల కనబడలేదు. 2023 జనవరి 5న విడుదల చేసిన ఫైనల్ పబ్లికేషన్‌లో జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 12,52,432గా చూపెట్టగా ప్రస్తుతం విడుదల చేసిన తుది జాబితాలో ఆ సంఖ్య 12,75,540కే పరిమితమైంది. గతేడాది తుది ప్రచురణతో పోలిస్తే కేవలం 23,108 ఓట్ల పెరుగుదల మాత్రమే నమోదు కావడం గమనార్హం. గతేడాది అక్టోబరులో విడుదల చేసిన ముసాయిదాతో పోలిస్తే ఈ వృద్ధి 12,408 ఓట్లకే పరిమితమైంది.

ఫాం7ల దుర్వినియోగం కూడా కారణమే..

పాలకపార్టీ ఫాం7ల దుర్వినియోగానికి పాల్పడడం వల్ల చాలాచోట్ల అర్హులైన వారి ఓట్లు కూడా తీసివేశారని ప్రతిపక్ష టీడీపీ ఆరోపిస్తోంది. అందువల్లే ఆశించిన స్థాయిలో పెరుగుదల నమోదు కాలేదని, ఒక్క పర్చూరులోనే ఫాం7లతో పదివేలకు పైగా ఓట్లు తొలగించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చనే వాదనను టీడీపీ చేస్తోంది. వీటితో పాటు సిమిలర్ ఎంట్రీలలో గందరగోళం తలెత్తడం వల్ల కూడా దాదాపు 3,000 ఓట్లకు పైగా కోత పడిందని సమాచారం. ఇవే కాకుండా సాంకేతిక కారణాల వల్ల ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోనివి దాదాపు 5,000 దరఖాస్తులు ఉండడం గమనార్హం.

ఫాం6లు 70,000కు పైనే...

కొత్త ఓటు నమోదుకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి దాదాపు 70,000కు పైనే ఫాం6లు యంత్రాంగానికి అందాయి. వీటిల్లో తిరస్కరణ కూడా పదిశాతానికి మించలేదు. కానీ మరణాలకు సంబంధించి అధిక ఓట్లు తొలగించడం, కొత్త ఓటు నమోదు విషయంలో ఆశించిన స్థాయిలో యువత నుంచి స్పందన కనబడక పోవడం కూడా ఎన్నికల ఏడాదిలో ఓటర్ల పెరుగుదల నామమాత్రంగానే ఉందన్న విమర్శలు వినబడుతున్నాయి. కొత్త ఓటు నమోదు విషయంలో రాజకీయ పార్టీల ఆసక్తి తప్పితే యువతకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన డానికి ప్రస్తుతం ఎన్నికల కమిషన్ విడుదల చేసిన గణాంకాలే నిదర్శనంగా కనబడుతున్నాయి.

ఓటర్ల తుది జాబితా అత్యంత పారదర్శకం: కలెక్టర్

ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందించామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బాపట్ల కలెక్టరేట్‌లో సోమవారం ఓటర్ల జాబితాను విడుదల చేశారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు వచ్చిన ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్‌లు, వీవీ ప్యాట్స్ యంత్రాలన్నీ రాజకీయ పార్టీల సమక్షంలో మొదటి దశ పరిశీలన పూర్తయిందన్నారు. జిల్లాలో 1,510 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో విద్యుత్, తాగునీరు, ర్యాంప్ వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల మేరకు అన్ని సిద్ధం చేశామన్నారు. రాజకీయపార్టీలు నుంచి వచ్చిన 39,754 ఫిర్యాదులను స్వీకరించి సమగ్రంగా విచారణ జరిపించామన్నారు. గత ఏడాది జనవరి 6వ తేది నుంచి ఇప్పటివరకు 1,84,292 దరఖాస్తులు నమోదు అయ్యాయన్నారు. 1,55,426 విచారించామన్నారు. 28,547 దరఖాస్తులు తిరస్కరించామన్నారు. తప్పులు ఫిర్యాదులు చేసిన వారిని గుర్తించి ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు చట్ట పరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. పర్చూరు నియోజకవర్గంలో తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేశామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.పర్చూరు ఈఆర్‌వో ఫిర్యాదు మేరకు 58మంది పై 16 కేసులు నమోదు చేశామని, ఛార్జిషీట్ వేశామని వివరించారు. వారందరికి నిబంధనల మే రకు 41వ నోటీసులు జారీ చేశామన్నారు. సమావేశంలో ఆర్డీవో పి.వెంకటరమణ, ఆరు నియోజకవర్గాల ఈఆర్‌వోలు పాల్గొన్నారు.



ఓటర్ల తుది జాబితాను ప్రకటించి వివరాలు తెలియజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్.

బాపట్ల జిల్లాలోని 6నియోజకవర్గాలలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జండర్	మొత్తం
● వేమూరు	94,875	1,00,872	9	1,95,756
● రేపల్లె	1,11,071	1,15,475	20	2,26,566
● బాపట్ల	91,309	96,409	6	1,87,724
● పర్చూరు	1,10,256	1,15,508	6	2,25,770
● అద్దంకి	1,18,159	1,22,910	12	2,41,081
● చీరాల	9,68,56	1,01,767	20	1,98,643
మొత్తం	6,22,526	6,52,941	73	12,75,540

పల్నాడు జిల్లాలో.. 17,12,829

పల్నాడు జిల్లాలో స్వల్పంగా ఓట్లు పెరిగాయి. జిల్లావ్యాప్తంగా 17,12,829 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. పురుషుల కంటే మహిళాల ఓటర్లే అధికంగా ఉన్నారు. 8,37,200 మంది పురుషులు, 8,75,433 మంది మహిళలు, థర్డ్ జండర్ 196 మంది ఓటర్లుగా ఉన్నారు. పురుషుల కంటే మహిళల ఓట్లు 38,233 అధికంగా ఉన్నాయి. అత్యధికంగా గురజాల నియోజక వర్గంలో 2,71,277 ఓట్లు నమోదు కాగా తక్కువగా పెదకూరపాడు నియోజకవర్గంలో 2,28,936 ఓట్లు ఉన్నాయి. ఓటర్ల జాబితా సవరణకు ముందు గత ఏడాది జనవరిలో 16,86,524 ఓట్లు ఉండగా సవరణ అనంతరం 17,12,829 ఓట్లు పెరిగాయి. ఏడాది కాలంలో 24,779 ఓట్లు పెరిగాయి. ఫారం -6లు 1,39,671 అందగా 1,10,345 ఆమోదించగా 24,400 దరఖాస్తులను తిరస్కరించారు. ఫారం-7లు 1,34,669 దరఖాస్తులు దాఖలు కాగా 1,02,790 ఆమోదించగా 28,403 తిరస్కరించారు. ఫారం-8లు 1,07,568 దాఖలయ్యాయి. వీటిలో 97,654 ఆమోదించి 5,715 తిరస్కరించారు. ఈ మూడు రకాల దరఖాస్తులు 3,81,908 దాఖలయ్యాయి. వీటిలో 3,10,789 ఆమోదించగా 58,518 తిరస్కరించారు. కొత్తగా 1,11,178 ఓట్లు నమోదు కాగా 1,03,788 ఓట్లు తొలగించారు. తొలగింపుల్లో 60,678 మృతుల, 30,907 ఓట్లు వలసదారులు, 12,203 డబుల్ ఎంట్రీ ఓట్లు ఉన్నాయి.



గుంటూరు జిల్లాలో.. 17,72,022

తుది ఓటర్ల జాబితా ప్రకారం గుంటూరు జిల్లా ఓటర్ల సంఖ్య 17,72,022కి చేరింది. జిల్లాలో 9,13,852 మంది ఓటర్లతో మహిళలు తమ పైచేయిని నిలబెట్టుకొన్నారు. తద్వారా మొత్తం ఓటర్లలో 51.65 శాతంగా ఉన్నారు. పురుషులు 8,55,262, ట్రాన్స్ జెండర్లు 191 కలిపి మొత్తం ఓటర్లు 17,69,305 మంది ఉన్నారు. వీళ్ల కాక ఎన్ఆర్ఐ ఓటర్లు పురుషులు - 724, మహిళలు 206, సర్వీసు ఓటర్లు పురుషులు 1714, మహిళలు 73 కలిపి మొత్తంగా 17 లక్షల 72 వేల 022కి ఓటర్ల సంఖ్య చేరుకొన్నది. ముసాయిదా ఓటర్ల జాబిత ప్రచురించేనాటికి 17,37,447 మంది ఓటర్లున్నారు. దీనిని పరిగణనలోకి తీసుకొంటే చేర్పులు, తొలగింపులు అనంతరం 34,575 మంది ఓటర్లు పెరిగారు. అలానే 18-19 ఏళ్ల వయస్సు ఓటర్లు 14,399 మంది ఉంటే ఆ సంఖ్య నేడు 35,762కి పెరిగింది. 80 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 31,800, దివ్యాంగులు 14,270 మంది ఓటర్లున్నారు. లింగ నిష్పత్తి ప్రతీ 1000 మంది పురుషులకు 1069 మంది మహిళలున్నారు. ఎలక్టోరల్ పాపులేషన్ రేషియో ప్రతీ వెయ్యి మంది పౌరుల్లో 730 మంది ఓటర్లున్నారు.





నాడు-నేడుకు నిధుల గ్రహణం

- విడుదల కాని నిధులు
- శ్లాబ్‌దశ దాటి ముందుకు కదలని అభివృద్ధి పనులు
- వాటర్‌ప్లాంట్స్ ఇన్‌స్టలేషన్‌కు నిధుల్లేవ్..
- మరోమూడు నెలల్లో ముగియనున్న విద్యాసంవత్సరం



లాలుపురం జడ్పీస్కూల్‌లో అసంపూర్తిగా భవనాలు

ఒక చోట శ్లాబ్ పూర్తయినా అంతర్గత గోడల నిర్మాణం జరగ లేదు.. మరో చోట ఇంకా శ్లాబ్ దశలోనే వెక్కిరిస్తున్న నిర్మాణాలు.. ఇంకో చోట ఎలక్ట్రికల్, పంబ్లింగ్ పనుల్లో జాప్యం.. మరోచోట వాటర్ ప్లాంట్స్ వచ్చినా ఇన్‌స్టలేషన్‌కు నిధులు లేక పరదాలు కప్పి నెట్టుకొస్తున్న వైనం.. ఇదీ ఉమ్మడి జిల్లాలో నాడు నేడు పనుల దుస్థితి. నిధుల విడుదలలో తీవ్ర జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు పూర్తిస్థాయిలో పనులు చేయడం లేదు. ఫలితంగా ఈ విద్యా సంవత్సరం నిర్మాణాలు అందుబాటులోకి వస్తాయో లేదోననే అనుమానం ప్రధానో పాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు(విద్య), జనవరి 22: ఉమ్మడి జిల్లాలో నాడు నేడు పనులు రెండు విడతల్లో ప్రారంభం అయ్యాయి. మొదటి విడత దాదాపు 1,170 పాఠశాలల్లో పనులు ప్రారంభం కాగా రెండో విడత 680 పాఠశాలల్లో నిర్మాణాలు ప్రారంభించారు. నాడు నేడు పనుల్లో ప్రధానంగా అదనపు తరగతి గదుల నిర్మాణం, బెంచీల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్ బోర్డులు ఏర్పాటు, ఆర్వోప్లాంట్స్ నిర్మాణం ఇలా అనేక పనుల్ని ఇందులో చేర్చారు. తొలి విడతతో ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసిన అనేక పనులు ఇంకా పూర్తిదశకు చేరుకోలేదు. ఇక రెండో దశ పనులు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి.

నిధుల విడుదల ఏదీ?

ప్రభుత్వం నాడు నేడు పనులతో సర్కారు పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామని సొంత డప్పు కొట్టుకుంటోంది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో అనేక స్కూల్స్ మొదటి రెండో విడత నాడు నేడు పనులు అస్తవ్యస్తంగా, అసంపూర్తి ఉన్నాయి. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోని స్కూల్స్ విషయం అటుంచితే గుంటూరు నగరంలోని ఎస్‌కేబీఎం(ఏటీ అగ్రహారం), పట్టాభిపురం మున్సిపల్ స్కూల్, కొల్లిశారద మున్సిపల్ స్కూల్ (కేవీపీ కాలనీ,) లాలుపురం జడ్పీ స్కూల్(వికలాంగుల కాలనీ) ఇలా అనేక చోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని స్లాబ్ పూర్తిగా కొన్ని ఫినిషింగ్ దశలో మరికొన్ని పిల్లర్స్ స్థాయిలో పనులు ఉన్నాయి.

వాటర్‌ప్లాంట్ మిషన్లకు ముసుగేశారు..

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు పనుల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో అనేక స్కూల్స్‌కు వాటర్ ప్లాంట్స్ యంత్రాలు వచ్చాయి. వాటిని ఇన్‌స్టాల్ చేయడానికి కూడా నిధులు లేవు. ఒక్కో యంత్రం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖరీదు చేస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏజన్సీలు వీటిని తీసుకువచ్చి పాఠశాల ప్రాంగణాల్లో పెట్టి ముసుగేశారు. వీటిని ఇన్‌స్టలేషన్ చేయడానికి నిర్దేశించిన ప్రాంతంలో షెడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. షెడ్డు నిర్మాణం పూర్తి కాకుండానే వాటర్‌ప్లాంట్స్ మిషన్లు పాఠశాలలకు పంపారు. ఇప్పుడు అవి ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉన్నాయి. కాంట్రాక్టర్లు నిధులు చెల్లించకపోవడం వల్లే పనులు నిలిచి పోయినట్లు చెబుతున్నారు. ఈ విద్యాసంవత్సరం నాడు నేడుతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవనాలు అందుబాటులోకి వస్తాయో లేదో వేచి చూడాలి. మరోవైపు నాడు నాడు పనుల సిమెంట్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, శానిటరీ మెటీరియల్‌తో తరగతి గదులు, ఇసుక, కంకర, ఇనుము వంటి మెటీరియల్‌తో పాఠశాలల్లో ఆటస్థలాలు నిండిపోయాయి. ఈ విద్యాసంవత్సరం నాడు నేడుతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవనాలు అందుబాటులోకి వస్తాయో లేదో వేచి చూడాల్సి ఉందని హెచ్‌ఎంలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు ఎన్జీవోకాలనీలోని ఎస్‌కేబీఎం స్కూల్‌లో ముసుగు వేసిన వాటర్‌ప్లాంట్ మిషన్

అద్దంకిలో వైసీపీకి.. భారీ షాక్

- ఎమ్మెల్యే రవికుమార్‌తో భేటీ అయిన అట్లా చినవెంకటరెడ్డి..
- ఎంపీపీ, తొమ్మిది మంది ఎంపీటీసీలు, 12మంది సర్పంచ్‌లు

అద్దంకి, జనవరి 22: బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో వైసీపీకీ భారీ షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైసీపీకి మంచి పట్టు ఉన్న సంతమాగులూరు మండలంలో ఊహించని విధంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వైసీపీకి ఏకపక్షంగా జరిగిన సంతమాగులూరు మండలంలో అత్యధిక శాతం ప్రజాప్రతినిధులు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈక్రమంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌తో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ అట్లా చినవెంకటరెడ్డి, ఎంపీపీ యలమందతో పాటు మరో తొమ్మిది మంది ఎంపీటీసీలు, 12మంది సర్పంచ్‌లు జొన్నతాళి వద్ద క్యాంప్ కార్యాలయంలో సమావేశమైనట్లు తెలుస్తోంది.

సంతమాగులూరు మండలంలో గత స్థానిక సంస్థల ఎన్నికలలో 17 ఎంపీటీసీలు వైసీపీకి ఏకగ్రీవం అయ్యాయి. 20 గ్రామపంచాయతీల్లో 90శాతం వైసీపీ సానుభూతిపరులు ఎన్నికయ్యారు. అట్లా చినవెంకటరెడ్డి ఎంపీపీగా ఎన్నికై ఇటీవల వరకు పనిచేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో చినవెంకటరెడ్డి ఎంపీపీగా రాజీనామా చేశారు. తన అనుచరుడుగా ఉన్న పాత మాగులూరు ఎంపీటీసీ యలమందను ఎంపీపీగా చేయటంలో సఫలీకృతులయ్యాడు.

గుర్తింపు ఇవ్వకపోవడంతోనే..

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన పాణెం హనిమిరెడ్డి బాధ్యతలు స్వీకరించే సమయంలో అట్లా చినవెంకటరెడ్డి వర్గానికి సరైన గుర్తింపు ఇవ్వకపోగా, ప్రత్యర్థి వర్గానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం కూడా మరింత ఆగ్రహం తెప్పించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో 20 రోజుల క్రితం నర్సరావుపేటలో తన అనుచరులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ సందర్భంగా కూడా వైసీపీ ఇన్‌చార్జ్‌కి అల్టిమేటం ఇచ్చినట్లు తెలిసింది. వైసీపీలో తమ వర్గానికి సరైన గుర్తింపు ఉండదన్న నిర్ణయానికి వచ్చిన అట్లా తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈక్రమంలో సోమవారం రాత్రి జొన్నతాళి వద్ద రవికుమార్ క్యాంప్ కార్యాలయలో ఎంపీపీ యలమంద, తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు, 12మంది సర్పంచ్‌లతో వెళ్ళి చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. త్వరలో చంద్రబాబు సమక్షంలో అందరూ కలిసి టీడీపీలో చేరేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నేతలతో ఇన్‌చార్జి బేరాలు

అయితే విషయం తెలుసుకున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంపీటీసీలతో బేరాలు మొదలు పెట్టినట్లు సమాచారం. అయితే ఏ ఒక్కరు కూడా వెనుకడుగువేసే ప్రసక్తే లేదని ఖరాఖండిగా చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే బాటలో మిగిలిన మండలాల్లో కూడా పలువురు వైసీపీ నేతలు రాజీనామా చేసి టీడీపీ కండువాలు కప్పుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. నియోజకవర్గంలో అసలే అంతర్గత విభేదాలతో అంతంతమాత్రంగా ఉన్న వైసీపీకి ఇది కోలుకోలేని దెబ్బగా పలువురు అంచనా వేస్తున్నారు.

కొనసాగుతున్న వర్గ విభేదాలు

బాపట్ల, జనవరి22(ఆంధ్రజ్యోతి): పర్చూరులోని వైసీపీ ద్వితీయశ్రేణి నేతాగణం ఇటీవల సమావేశమైనట్లు తెలుస్తోంది. వీరంతా త్వరలో టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. సోమవారం చీరాలలో జరిగిన వైసీపీ సామాజికసాధికార బస్సుయాత్ర సభలో మంత్రి మేరుగ, ఎంపీలు సురేష్, మోపిదేవి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో చీరాల నియోజకవర్గ అభ్యర్థి వెంకటేషేనని ప్రకటించారు. ఈనేపథ్యంలో పర్చూరు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ తాడేపల్లిలోని సీఎంవోలో ముఖ్యనాయకులను కలిసినట్లు సమాచారం. ఆ సందర్భంగా గతంలో తనకు చెప్పిన మాటలను గుర్తుచేస్తూ ఆ మేరకే అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. చీరాలలో జరిగిన బస్సుయాత్రకు ఆ మంచి వర్గం గైర్హాజరు అయింది. ఆ క్రమంలోనే స్థానిక అభ్యర్థి ఎవరనే దానిపై స్పష్టత ఇచ్చినట్లు ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్ వర్గీయులు చెబుతున్నారు. నిన్నమొన్నటి దాకా పర్చూరు నియోజకవర్గం నుంచి ఆమంచి పోటీ చేస్తారని భావించారు. అయితే అద్దంకి అభ్యర్థిగా హనిమిరెడ్డి పేరును అధిష్ఠానం ఖరారు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి వరకు అక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన కృష్ణచైతన్య వ్యతిరేక స్వరం వినిపించారు. ఆ క్రమంలో చైతన్యను పర్చూరు నుంచి పోటీ చేయాలని సీఎం జగన్ చెప్పినట్లు అందుకు చైతన్య, గరటయ్యలు సానుకూలంగా స్పందించలేదని ప్రచారం జరిగింది.

అంగన్‌వాడీలపై..వేటు

- బాపట్ల జిల్లాలో 917 మంది వర్కర్స్..
- 878 మంది హెల్పర్స్‌పై చర్యలకు సిద్ధం

బాపట్ల, జనవరి22(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం సోమవారం అంగన్‌వాడీలు పిలుపిచ్చిన చలో విజయవాడ కార్యక్రమంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఆదివారం అర్ధరాత్రి నుంచే పోలీసులు రైల్వేస్టేషన్లను, బస్‌స్టేషన్లను జల్లెడ పట్టడం ప్రారంభించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్వయంగా ఆదివారం అర్ధరాత్రి సమయంలో బాపట్ల రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే విజయవాడకు వెళ్లేదారులన్నింటినీ తమ ఆధీనంలోకి తీసుకుని ప్రయాణ వివరాలు అడిగి తెలుసుకున్నాకే అనుమంతించారు.

ఇళ్ల దగ్గర ఉన్నవారిని సైతం..

ఇంటి దగ్గర ఉన్న అంగన్‌వాడీలను సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. చీరాలలో అంగన్‌వాడీలను అరెస్టు చేసి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అద్దంకిలో వారి ధర్నాకు సంఘీభావం ప్రకటించిన సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్యను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బాపట్ల టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో కలిపి 18 మంది అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని సాయంత్రం వరకు అక్కడే ఉంచారు.

తాము విధుల్లో ఉన్నామని చెబుతున్నా..

తాము ఇప్పటికే విధుల్లో చేరామని చెబుతున్నా వినకుండా పోలీస్ స్టేషన్‌కు తరలించారని బాపట్లలోని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది ప్రభుత్వం ఇచ్చిన గడువు సోమవారం ఉదయం లోపల విధులకు హాజరవుదామనుకున్న అంగన్‌వాడీలను సైతం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించడంతో ఖాకీల వైఖరిని వారు తప్పుబడుతున్నారు.

917 మంది వర్కర్స్, 878 మంది హెల్పర్స్..

ప్రభుత్వం హెచ్చరించినట్లుగానే జిల్లావ్యాప్తంగా 917మంది వర్కర్స్, 878 మంది హెల్పర్స్‌పై టెర్మినేషన్ కొరడా విధించడానికి సిద్ధమైంది.ఇందుకు సంబంధించిన ఫైల్ సోమవారం సాయంత్రమే కలెక్టర్ వద్దకు వెళ్లగా తొలగింపునకు ఆయన ఆమోద ముద్ర వేశారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి తొలగించిన అంగన్‌వాడీలకు నోటీసులను అందించనున్నారు. 949 మంది వర్కర్స్, 945 మంది హెల్పర్స్ సోమవారం ఉదయానికే విధుల్లో చేరారు. పోలీసుల అత్యుత్సాహంతో సోమవారం విధుల్లో చేరదామనుకున్న అంగన్‌వాడీలు సైతం ప్రభుత్వం వేసిన వేటుకు బలవనున్నారు.



తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతి రాష్ట్ర సంపద

● దానిని నిర్వీర్యం చేయడం తగదు

● 1497వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, జనవరి 22: మళ్ళీ అధికారంలోకి రారని తెలిసి వైసీపీ నేతలు రాష్ట్రంలో అందినకాడికి దోచుకుంటున్నారని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1497వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ రాష్ట్ర సంపద అయినటువంటి అమరావతిని నిర్వీర్యం చేయటం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. ఐదు కోట్ల మంది ఆంధ్రుల రాజధాని అమరావతి అని చెపితేనే భూములిచ్చామని స్పష్టం చేశారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి మూడు రాజధానులంటూ అమరావతి కలను చిదిమేశారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. తుళ్ళూరు, వెలగపూడి, మందడం, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం, తదితర రాజధాని గ్రామాల్లో రైతుల ఆందోళనలు, నిరసన దీక్షలు కొనసాగాయి.

1500వ రోజు శిబిరాల్లోనే...

రైతు ధర్నా శిబిరాల్లోనే 1500వ రోజు అమరావతి ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సోమవారం రైతు సమన్వయ కమిటీ నిర్ణయించింది. జూమ్ మీటింగ్ ద్వారా సమావేశం అయిన కమిటీ ముందుగా దళిత ఉద్యమ నేత గడ్డం మార్టిన్‌కు నివాళి అర్పించింది. తదనంతరం ఉద్యమ కార్యచరణ ప్రణాళికపై చర్చించింది. ఏ శిబిరంలో వారు ఆ శిబిరంలోనే కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించింది.

కృష్ణమ్మ ఒడిలో లోకేశ్ జన్మదిన వేడుకలు



కృష్ణానదిలో పడవల ర్యాలీతో భారీ కటౌట్‌ను ఊరేగిస్తూ లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

తుళ్ళూరు జనవరి 22: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేశ్ జన్మదిన వేడుకలు రాజధాని అమరావతిలో ఒక రోజు ముందుగా జరిగాయి. దళిత జేఏసీ, టీడీపీ నాయకుడు పులి చిన్నా(మరియదా సు) ఆధ్వర్యంలో తాళ్ళాయపాలెం పుష్కర ఘాట్ వద్ద కృష్ణానదిలో ఈ వేడుకలు సోమవారం నిర్వహించారు. నీళ్ళలో లోకేశ్ భారీ కటౌట్‌ను ఊరేగించారు. పడవలతో నీళ్లల్లో ర్యాలీ చేశారు. కటౌట్‌కు పూలు చల్లుతూ, బాణసంచా కాల్చారు. కేక్‌ను కత్తిరించారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర యువతకు భరోసానిచ్చిందన్నారు. అందుకు కృతజ్ఞతగా వినూత్న రీతిలో ఆయన పుట్టినరోజు వేడుకలు ముందస్తుగా జరపాలని కృష్ణానదిలో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, దళిత యువత, పాతర్ల రమేష్, మాదిగ మహానాడు నాయకుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మరికొందరు సీఐల బదిలీ

గుంటూరు, జనవరి 22: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రేంజిలో సీఐల బదిలీల వరంపర కొనసాగుతోంది. దీనిలో భాగంగా సోమవారం మరికొందరు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. మేడికొండూరు సీఐ కె.వాసును గుంటూరు సైబర్ క్రైమ్, సోషల్ మీడియా విభాగానికి బదిలీ చేశారు. పల్నాడు జిల్లా కారంపూడి సీఐ డి.జయకుమార్‌ను మేడికొండూరు సీఐగా నియమించారు. పాత గుంటూరు సీఐ మొగిలి వెంకట సుబ్బారావును నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం సీఐగా, ఇప్పటివరకు అక్కడ సీఐగా ఉన్న హైమారావును బుచ్చిరెడ్డిపాలెం ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. వీఆర్‌లో ఉన్న బి.రమేష్ బాబును పాత గుంటూరు సీఐగా నియమించారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం సీఐ బి.పాపారావును తిరుపతి జిల్లా గూడూరు 1వ టౌన్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. మాచర్ల రూరల్ సీఐ షేక్ సమీవుల్లాను ప్రకాశం జిల్లా దర్శి సీఐగా నియమించారు. దర్శి సీఐ జె.రామకోటయ్యను వీఆర్‌కి బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న బీవీవీ సుబ్బారావును గూడూరు సీఐగా నియమించారు. ప్రకాశం జిల్లా ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ కె.అజయ్ కుమార్‌ను నెల్లూరు జిల్లా దిశ 2 సీఐగా నియమించారు. వీఆర్‌లో ఉన్న టి.విజయ్ కృష్ణను ప్రకాశం సీసీఎస్‌కు బదిలీ చేశారు. ప్రకాశం సీసీఎస్‌లో ఉన్న పి.బాలాజీని వీఆర్‌కు బదిలీ చేశారు.

● రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు సొంత జిల్లాలో పనిచేస్తున్న 75 మంది ర్యాంకర్ ఎస్‌ఐలను వేర్వేరు జిల్లాలకు బదిలీచేస్తూ ఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లాలో 16 మందిని, పల్నాడు జిల్లాలో ఏడుగురిని, బాపట్ల జిల్లాలో 8 మందిని, ప్రకాశం జిల్లాలో 20 మందిని, నెల్లూరు జిల్లాలో 17 మందిని, తిరుపతి జిల్లాలో ఏడుగురిని ఇతర జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

28న జయదేవ్ వీడ్కోలు విందు

● పార్లమెంటు పరిధిలోని 4వేల మంది కార్యకర్తలకు ఆహ్వానం

● హ్యాట్రిక్ కొట్టే అవకాశం ఉన్నా పోటీకి విముఖత

● ఇక పూర్తికాలం వ్యాపారాలపైనే దృష్టి



గుంటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఊహించిన విధంగానే క్రియాశీలక రాజకీయాలకు గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 27వ తేదీ సాయంత్రానికి జయదేవ్ తన తల్లి గల్లా అరుణతో పాటు గుంటూరుకు చేరుకుంటారు. 28న రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో పార్టీ శ్రేణులను పెద్ద ఎత్తున విందు ఇచ్చి వారి వద్ద సెలవు తీసుకోనున్నారు. గత రెండు ఎన్నికల్లో తన విజయానికి సహకరించిన ఆయా నియోజకవర్గాల నేతలను, పార్టీ కార్యకర్తలను ఈ విందుకు హాజరవ్వాల్సిందిగా ఆహ్వానిస్తున్నారు. సుమారు 4వేల మంది ఈ విందుకు హాజరవుతారని భావిస్తున్నారు. 2014లో అనూహ్యంగా గుంటూరు పార్లమెంటు పరిధి నుంచి ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించారు. అలాగే 2019లో రెండోసారి ఎన్నికల బరిలోకి దిగి ఊహించని ఘన విజయం సాధించారు. పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆరు నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధించినప్పటికీ ఎంపీగా జయదేవ్ గెలవటం వైసీపీలో కలవరం రేకెత్తించింది. జయదేవ్ చిత్తూరు జిల్లా నుంచి గుంటూరు జిల్లాకు వలస వచ్చినప్పటికీ ఇక్కడి పార్టీ శ్రేణుల ఆదరణ ఎంతగానో పొందారు. వ్యాపార రీత్యా నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకపోయినప్పటికీ పార్లమెంటు సమావేశాలకు తప్పనిసరిగా హాజరై స్థానిక సమస్యలపై తన గళం వినిపించేవారు. విదేశాల్లో చదువుకున్న జయదేవ్‌కు ఇంగ్లీష్ బాషపై మంచి పట్టు ఉండటంతో పార్లమెంటు సమావేశాల్లో ఆయన ప్రసంగాలు ఆకట్టుకునేలా ఉండేవి. ప్రత్యేక హోదాపై కూడా సభలో అలుపెరగని పోరాటం చేయటమే కాకుండా మిస్టర్ మోదీ అంటూ ప్రధానిని నిలదీయటం అప్పట్లో చర్చనీయాంశమైంది. రానున్న ఎన్నికల్లో కూడా తిరిగి జయదేవ్‌నే తమ పార్టీ తరఫున బరిలోకి దించాలని పార్టీ అధినేత చంద్రబాబునాయుడు భావించినప్పటికీ పోటీకి విముఖత వ్యక్తపరచటం జరిగింది. దీంతో జయేదవ్‌కు బదులుగా మరొకరిని గుంటూరు బరి నుంచి దింపేందుకు టీడీపీ యోచిస్తోంది.

అమలాపురం తరహాలో అల్లర్లకు వైసీపీ కుట్ర

● తన ఫొటోతో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

● దీని వెనుక ఓ మంత్రి, ఎమ్మెల్యే పీఏలు

● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆరోపణ

● గుంటూరులోని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు



గుంటూరులోని ఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

గుంటూరు, జనవరి 22: అమలాపురంలో కులాల మధ్య విధ్వంసం సృష్టించిన విధంగానే కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కూడా అల్లర్లు, విధ్వంసాలకు వైసీపీ భారీ కుట్రకు తెరతీసిందని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆరోపించారు. తన ఫొటో పెట్టి అంబేద్కర్‌పై తాను అనని మాటలను అన్నట్లుగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రకటనలతో వైరల్ చేసి విధ్వంసానికి కుట్ర చేశారన్నారు. ఈ మేరకు సోమవారం గుంటూరులో ఎస్పీ కార్యాలయంలోని స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ అందుబాటులో లేకపోవడంతో స్పందనలో ఉన్న డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ కుట్ర వెనుక మంత్రి సీదిరి అప్పలరాజు, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైసీపీ సోషల్ మీడియా డిజిటల్ క్రియేటర్, నందిగామ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ప్రభాస్ వెంకట్ సుంకరతోపాటు పలువురు వైసీపీ నాయకులు ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన పొత్తుతో అధికారం కోల్పోతున్నామనే భయంతో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అమలాపురం తరహాలో కులచిచ్చు రేపి అల్లర్లు, విధ్వంసాలు సృష్టించాలని వైసీపీ నాయకులు కుట్రపన్నినట్లు ఆరోపించారు. ఈ పోస్ట్ ను పలనాడు న్యూస్ వాట్సాప్ గ్రూపులో టీం గోపిరెడ్డి పేరుతో ఎమ్మెల్యే పీఏ, అలాగే మంత్రి సీదిరి అప్పలరాజు పీఏ వెంకట రమణ తన ఫేస్ బుక్ పేజీలో ఉంచి తనపై తీవ్ర ఆరోపణలు చేశారన్నారు. సాక్ష్యాధారాలతో సహా ఈ నెల 20న పొన్నూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. తాను తప్పు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమేనని ప్రకటించారు. దీనిపై తక్షణం కేసు నమోదు చేసి నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్పీని కలిసిన వారిలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొల్లెద్దు సుశీలరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు దాసరి రమణ, గుడిమెట్ల దయారత్నం, సుఖవాసి శ్రీనివాసరావు, పులివర్తి వెంకటేశ్వరరావు (అజార్), రావిపాటి సాయి కృష్ణ, పొన్నూరు రూరల్ పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, పెదకాకాని మండల పార్టీ అధ్యక్షులు మురళీకృష్ణ, బ్రహ్మారెడ్డి, కూచిపూడి రాజేష్ , జయరామిరెడ్డి, బూసిబాబు, అమరేంద్ర, తాళ్ల శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, సుబ్బారావు, సంజీవ్, సాంబిరెడ్డి పెద్ద విక్రమ్, పిన్నమనేని రామచంద్రరావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

27న గుంటూరుకు ఏపీసీసీ చీఫ్ షర్మిల

● కాంగ్రెస్ ముఖ్య నేతలతో సమీక్ష

గుంటూరు, జనవరి 22: ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ షర్మిల ఆ పార్టీ ముఖ్యనేతలతో సమీక్ష కోసం జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈనెల 27న తొలిసారిగా గుంటూరు పర్యటనకు షెడ్యూల్ ఖరారు చేశారు. 27న ఒకే రోజున కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పర్యటించనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఉదయం కృష్ణా జిల్లా బందరు పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా కేంద్రం గుంటూరు పర్యటనకు రానున్నారు. సాయంత్రం 5 గంటలకు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటకు వైఎస్ షర్మిల చేరుకునేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఆయా జిల్లాల్లో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ నుంచి దూరమై తటస్థంగా ఉంటున్న నేతల వివరాల వంటి అంశాలపై స్థానిక నేతలను అడిగి తెలుసుకోనున్నారు. ప్రస్తుతం జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు సమీక్షా సమావేశాలకు తరలిరావాలని నేతలు ఆదేశాలు జారీ చేశారు.

వైసీపీ ప్రభుత్వం ఇంటికెళితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, జనవరి 22: వైసీపీ ప్రభుత్వం ఇంటికేళ్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ అంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బాదుడే బాదుడని, సంక్రాంతి కానుక, క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా తీసివేశారని, టీడీపీ అధికారంలో ఉన్నపుడు నాణ్యమైన మద్యం సరఫరా చేస్తే, వైసీపీ వచ్చాక నాసిరకం మద్యం ఇస్తూ ధరలు పెంచారన్నారు. మద్యనిషేధం చేశాకే ఓటు అడుగుతానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి మందుబాబులను కూడా మోసం చేశారని విమర్శించారు. టీడీపీ ఐదు సంవత్సరాలలో ఒకసారికూడా కరెంట్ చార్జీలు పెంచలేదని, వైసీపీ వచ్చాక ఆర్టీసీ చార్జీలు, కరెంటు చార్జీలు పెంచారన్నారు. చెత్తపై పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి 200 యూనిట్ల లోపు కరెంట్ ఉచితం అన్నారని, కానీ ఇవ్వలేదన్నారు. వైసీపీ పాలనలో నష్టపోయింది బడుగు బలహీనవర్గాలేనన్నారు. వైసీపీ నేతల వేధింపులతో ఎస్సీలు ఆత్మహత్య చేసుకుంటున్నారని, 29మంది దళిత ఎమ్మెల్యేలను బదిలీ చేశారని విమర్శించారు. కబ్జా చేసిన వారికే న్యాయం చేసే ప్రభుత్వం ఇదని, భూరక్షణ చట్టం అమల్లోకి వస్తే మీ భూములు దక్కవన్నారు. టీడీపీ వచ్చాక భూరక్షణ చట్టం రద్దుచేస్తామని, డంపింగ్‌యార్డ్‌లో వేయాల్సిన చెత్త మరో ఊరిలో వేస్తారా? అని ప్రశ్నించా రు. చెల్లికి న్యాయం చేయలేని వాడు ఇక ప్రజలకేం చేస్తారని, విలువలు లేని వ్యక్తులు రాజకీయాలకు అనర్హులన్నారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఇసుక, మట్టి దోపిడీ చేస్తున్నారని, గిరిజన సంక్షేమ కోసం ప్రవేశపెట్టిన 16 పథకాలను జగన్‌రెడ్డి నిలిపేశారన్నారు. బీసీలకు ఏటా రూ.15వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి ఒక్క రూపాయి ఖర్చు పెట్టారా? అని జీవీ ప్రశ్నించారు.

ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టులదే కీలక పాత్ర



కిరణ్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న విలియం క్యారీ, ప్రసాద్‌రెడ్డి

గుంటూరు(మెడికల్), జనవరి 22: ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమైదని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు ఎన్ఎల్ఎన్ ప్రసాద్ రెడ్డి ఉద్ఘోధించారు. సోమవారం జీజీహెచ్ శుశృతహాల్‌లో ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు ఫార్మసిస్టులకు నిర్వహించిన నిరంతర వైద్య విద్య (సీఎంఈ) కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రోగులు వైద్యుల సలహా లేకుండా విచ్చలవిడిగా యాంటీ బయోటిక్ మందులు వాడితే ఔషధ నిరోధకత ఏర్పడి భవిష్యత్తులో చిన్న ఇన్‌ఫెక్షన్లు సైతం మొండి వ్యాధులుగా వేధిస్తాయని ప్రసాద్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యుల సలహా లేకుండా రోగులు సొంత వైద్యం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విలియం క్యారీ, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు బి.రాజశేఖరరెడ్డి, జి.దుర్గాప్రసాద్, కే రవీంద్రరెడ్డి, పులిపాటి సౌజన్య, సీహెచ్ రాధారాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సైంటిఫిక్ సెషన్‌లో వివిధ అంశాలపై ఫార్మసీ నిపుణులు ప్రసంగించారు.

భార్యపై గొడ్డలితో దాడి

● ఆపై పురుగుమందు తాగి భర్త ఆత్మహత్య



ఆలీసాహెబ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అబ్దుల్ రెహమాన్

పెదనందిపాడు, జనవరి 22: భా ర్యపై గొడ్డలితో హత్యాయత్నానికి పా ల్పడి, ఆపై పురుగుమందు తాగి భర్త మృతిచెందిన ఘటన మండలంలోని ఉప్పలపాడు గ్రామ శివారైన జరుగులవారిపాలెంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన షేక్ ఆలీసాహెబ్ (50), మస్తాన్‌బీలు కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం రాత్రి గొడవ పడ్డారు. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మస్తాన్‌బీని ఆలీసాహెబ్ గొడ్డలితో నరికి తీవ్రంగా గాయపరిచి ఆమెను ఇంట్లో నుంచి బయటకు గెంటేశాడు. అనంతరం ఇంటి తలుపులు మూసివేసి ఆలీసాహెబ్ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లోనే ఉన్న మనవడు తన తల్లికి సమాచారం ఇవ్వగా ఆమె వచ్చి చూడగా మస్తాన్‌బీ అప్పటికే తీవ్రరక్తస్రావమై అపస్మారక స్థితిలో పడి ఉంది. ఆమెను వెంటనే ప్రైవేటు వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఇంట్లోకి వెళ్ళి చూడగా ఆలీసాహెబ్ అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి ఎస్ఐ అబ్దుల్‌రెహమాన్ చేరుకొని వివరాలు సేకరించారు. దీనిపై భార్య మస్తాన్‌బీ, కుమార్తె నాగూర్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మన ప్రభుత్వంలో న్యాయం చేస్తాం..

● కన్నా లక్ష్మీనారాయణ



సానికొమ్ము రమణారెడ్డితో మాట్లాడుతున్న నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, జనవరి 22: రెండు నెలలు ఓర్చుకో.. రానున్న ఎన్నికల్లో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది.. అప్పుడు నీకు న్యాయం చేస్తానని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ... సానికొమ్ము రమణరెడ్డికి హామీ ఇచ్చారు. మండలంలోని కోటనెమలిపురి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కన్నా లక్ష్మీనారాయణ ఇంటింటికీ తిరుగుతూ సానికొమ్ము రమణరెడ్డి ఇంటికి వెళ్లి బాగున్నారా అని ప్రశ్నించారు. ఏం బాగుటాం సార్ నా కుమారుడును చంపారు అని ఆవేదన వ్యక్తం చేశారు. బాధపడుతున్న రమణరెడ్డి ఓదార్చి అసలు ఏం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. నీవు ఏం బాధపడకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుంది అప్పుడు నీ కుమారుడును ఎవరు చంపారు అనే విషయాన్ని బాహ్య ప్రపంచానికి తెలియజేసి దోషులకు శిక్ష పడేలా చేస్తానని హామీ ఇచ్చారు.

27 నుంచి రాజధాని రైతుల ప్రత్యామ్నాయ ప్లాట్లకు

మూడో విడత ఈ-లాటరీ

విజయవాడ, జనవరి 22: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) పరిధిలో భూములిచ్చిన రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు మూడో విడత ఈ-లాటరీని గ్రామాలవారీగా విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో కాంపిటెంట్ అథారిటీస్ నిర్వహిస్తారని కమిషనర్ వివేక్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు మాస్టర్ ప్లాన్‌కు లోబడి ఈ ప్రక్రియ జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే సంబంధిత భూయజమానులకు వ్యక్తిగతంగా సమాచారం అందించామని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఈ లాటరీ జరుగుతుందని వివరించారు.

గ్రామాలవారీగా ఈ-లాటరీ నిర్వహించే తేదీలు

ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు ఐనవోలులో, 27వ తేదీ ఉదయం 11.30 గంటలకు నేలపాడులో, 27వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు శాఖమూరులో, 27వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు తుళ్ళూరు 1&2లో, అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు అనంతవరంలో, 29వ తేదీ సాయంత్రం 4 గంటలకు కురగల్లు 1, 2లో, 30వ తేదీ ఉదయం 11 గంటలకు నెక్కల్లులో, 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కృష్ణాయపాలెంలో, 30వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు నిడమర్రు 1, 2లో, 31వ తేదీ ఉదయం 11 గంటలకు వెలగపూడిలో, 31వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు ఉద్దండరాయునిపాలెంలో, ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం 11 గంటలకు మందడం 1, 2లో, ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు కొండమరాజపాలెంలో, ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం 11 గంటలకు నవులూరు 1&2లో, ఫిబ్రవరి 2వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు లింగాయపాలెంలో, ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 11 గంటలకు వెంకటపాలెంలో, ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు రాయపూడి 1, 2లో ఈ-లాటరీ తీస్తామని వివరించారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు



ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్లజత

దుర్గి, జనవరి 22: మండల కేంద్రమైన దుర్గిలో వేంచేసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 70వ కల్యాణ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం జరిగిన ఆరుపళ్ల విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ప్రకాశం జిల్లా, నాగులఉప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్లజత రికార్డు స్థాయిలో 4846 అడుగుల దూరం బండను లాగి మొదటి స్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా కొండబాలువారిపాలూపిరిఞ చెందిన గుంటవల్లి లక్ష్మీదీక్షిత చౌదరి ఎడ్లజతలు 4732 అడుగులు, 4500 అడుగులతో రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. కృష్ణా జిల్లా ఆమ్రు మండలం బుల్లిపర్రు గ్రామానికి చెందిన గుంటూరు బుల్లికొండలు నాయుడు ఎడ్లజత నాలుగోస్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్యచౌదరి ఎడ్లజత ఐదోస్థానం, పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం మతుకుమల్లికి చెందిన ముండ్రా జీవప్రసాద్ ఎడ్లజత ఆరోస్థానంలో నిలిచాయి. ఈ పోటీలను వీక్షించేందుకు పలు గ్రామాల నుంచి రైతుల, ప్రజలు భారీగా తరలివచ్చారు. రిఫరీలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి, బండ్ల ప్రసాద్‌లు వ్యవహరించారు. కటకం రామారావు, గంది గోపాలరావులు పోటీలను పర్యవేక్షించారు. మంగళవారం న్యూకేటగిరి విభాగంలో పోటీలు జరగనున్నాయి.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,15,589 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,04,121 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. యార్డు ఆవరణలో 52,793 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			డీలక్స్	10000	19500
334	8500	20000	తెల్లకాయలు	5000	12000
నెంబరు. 5	9000	15000	ఏసీ కామన్ వెరైటీ		
273	10500	18000	334	--	--
341	9000	20000	273	--	--
4884	11000	14000	341	--	--
సూపర్ 10	10000	12000	ఏసీ స్పెషల్ వెరైటీ		
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తేజ	--	--
తేజ	8000	21000	బ్యాడిగి	--	-
బ్యాడిగి	9000	21000	దేవనూరుడీలక్స్	--	--
దేవనూరు			తెల్లకాయలు	--	--

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101, 109, 120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పీ. రంజిత్‌బాషా

స్పందన అర్జీలు వేగంగా పరిష్కరించండి

● కలెక్టర్ పీ.రంజిత్‌బాషా ఆదేశం

బాపట్ల,జనవరి 22 : స్పందనలో వచ్చిన అర్జీలను అధికారులు విచారించి వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ పీ.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బాపట్ల కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పలువురు వచ్చి అర్జీల ద్వారా తమ సమస్యలను వివరించారు. తమ పరిధిలోని సమస్యలకు కలెక్టర్ తక్షణమే పరిష్కార మార్గం చూపి మిగిలిన వాటిని విచారణ నిమిత్తం ఆయాశాఖల అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం ఫోర్టల్‌లో వచ్చిన అర్జీలను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 24నుంచి నియోజకవర్గాల స్థాయిలో క్రీడలు ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. నియోజకవర్గ స్థాయి ఇన్‌చార్జి అధికారులు క్రీడలను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

బోట్ల నిలుపుదలకు అడ్డంకిగావున్న ఇసుకమేటలు తొలగించాలి..

బాపట్ల, చీరాల సముద్రతీరంలో భారీగా ఇసుక మేటలు ఏర్పడటంతో మత్స్యకారులు బోట్లు నిలుపుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని, ఆయా ఇసుక మేటలను తొలగించాలని రాష్ట్ర మత్స్యకార కార్పోరేషన్ డైరెక్టర్ కన్నా మామిడయ్య విషయమై మత్స్యకార సొసైటీ అధ్యక్షులతో కలిసి స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ వద్ద కృపానగర్‌లోని ల్యాండింగ్ సెంటర్ ఉందని, సదరు కాల్వ పోగురు వద్ద ఇసుకమేటలు వేయటంతో బోట్లు నిలుపుదల సమస్యగా ఉందని, అధికారులు స్పందించి ఇసుక మేటలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో దోణి శ్రీను, వైకొండలు, ఎస్.అప్పారావు తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల ఇంటి స్థలాల దరఖాస్తులను వేగంగా విచారించాలి ..

జర్నలిస్టు ఇంటి స్థలాలకు వచ్చిన దరఖాస్తులను అధికారులు అత్యంత వేగంగా విచారించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులు ఆదేశించారు. జర్నలిస్టు ఇంటి స్థలాల మంజూరు కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ మొదటి సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం జరిగింది. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నందున ఈ ప్రక్రియను జిల్లాలో అత్యంత వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో జిల్లాకు వచ్చిన 229 దరఖాస్తులు తక్షణమే విచారించాలన్నారు. ఆయా మండలాలలో ప్రభుత్వ భూమి గుర్తించాలని లేకుంటే భూసేకరణకు ప్రతిపాదనలు పంపాలన్నారు. జర్నలిస్టులు నమోదు చేసుకున్న మండలం, వారు కోరినప్రాంతంలో భూమి కేటాయింపులపై అధికారులు దృష్టిసారించాలన్నారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే జర్నలిస్టులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, డీఆర్వో పి.వెంకటరమణ, పౌరసంబంధాలశాఖ సహయసంచాలకులు కె.సుబాషిణి, ఆర్డీవోలు గంధం రవీందర్, పి.సరోజినీ, హేలా షారోను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

● జాయింట్ కలెక్టర్ సి.హెచ్ శ్రీధర్

బాపట్ల,జనవరి 22 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30న రేపల్లె ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను సోమవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజి, అధికారులతో కలిసి జేసీ ఆవిష్కరించారు. ఉదయం 9.30 నుంచి ప్రారంభమయ్యే ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ అభ్యర్థులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఈవో రమాదేవి, విష్ణుమూర్తి, రవికిరణ్, నాగవెంకట్, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 58 దరఖాస్తులు

బాపట్ల, జనవరి 22 : బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ 58 మంది దరఖాస్తులు అందజేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ అర్జీదారుల అర్జీలు తీసుకొని వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని సంబంధిత పోలీసుస్టేషన్‌కు వాటిని పంపించారు. స్పందన అర్జీల పరిష్కారం చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని అధికారులను హెచ్చరించారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందనసెల్ ఇన్‌స్పెక్టర్ వి.మాలకొండయ్య, పోలీసుసిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

కంటికి రెప్పలా చూసుకుంటే

ఎందుకు నియోజక వర్గం మారారు

● వైసీపీ మండల స్థాయి సమావేశంలో బయటపడ్డ కార్యకర్తల మనోభావాలు

వేమూరు, జనవరి 22: 14 ఏళ్లు పాటు కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకున్నానంటూ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున చేసిన వ్యాఖ్యాలపై మండల స్థాయి సమావేశంలో కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం వేమూరులో వైసీపీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు హాజరు కాగా ఆయన సమక్షంలోనే పార్టీలో ఉన్న విభేదాలు బయటపడ్డాయి. ఇటీవల ఐలవరంలో మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఓ కార్యకర్త మాట్లాడుతూ, తమను కంటికి రెప్పలా చూసుకున్న మంత్రి ఇప్పుడు ఎందుకు నియోజకవర్గం మారారంటూ ప్రశ్నించారు. పైగా పార్టీకి సేవ చేసిన వారిని కాదని ప్రాధాన్యం లేని వ్యక్తులకు పెద్ద పీట వేసి తమను దూరం పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో స్టేజీపై ఉన్న ఓ మండల నేత మైకు లాక్కోవడంతో వాదోపవాదాల నడుమ కొట్లాటకు దారి తీసింది. దీంతో సమన్వయ కర్త కలుగజేసుకుని ఇకపై విభేదాలు లేకుండా అందరిని కలుపుకుంటూ పని చేస్తానని, పార్టీకి దూరమైన వ్యక్తుల వద్దకు తానే నేరుగా వెళ్లి వారు పార్టీలో చురుకుగా పాల్గొనేలా చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. గతంలో జరిగిన మనసులో పెట్టుకోకుండా ప్రతి ఒక్కరూ ఒక్కతాటిపై రావాలని కోరారు.

దుండివారిపాలెంలో మీమాట-నాబాట

కర్లపాలెం, జనవరి 22 : మండలంలోని దుండివారిపాలెంలో సోమవారం టీడీపీ జనసేనపార్టీ నాయకులతో కలసి టీడీపీ బాపట్ల ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ మీమాట-నాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటింటికి వెళ్ళి టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను మహిళలకు వివరించారు. అనంతరం నరేంద్రవర్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నక్కల వెంకటస్వామి, దాసు, మాజీ ఎంపీపీ తాతా లీలా వరప్రసాదరావు, మాజీ ఎంపీటీసీ కట్టా సుజాత తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

కర్లపాలెం, జనవరి 22 : మండలంలోని పేరలి గ్రామంలోని పేర్లమ్మతల్లి గుడి దగ్గర నుంచి తుమ్మలపల్లి రోడ్డు వరకు, మేకలవారిపాలెం శ్మశానం వాటికకు వెళ్ళే మార్గంలో నిర్మాణం చేయనున్న రహదారికి బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీరచయిత కోన వెంకట్, గ్రామ సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు (ఆధాం), యల్లావుల ఏడుకొండలు పాల్గొన్నారు.


రేపల్లె పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రామభక్తులు


బాపట్లలో విశ్వహిందుపరిషత్ ఆధ్వర్యంలో 54 కలశాలతో శోభాయాత్ర ..

సర్వం రామనామస్మరణే !

● రామనామస్మరణతో మారుమ్రోగిన జిల్లా

● శోభాయాత్రలు, ర్యాలీలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని దేవాలయాలు రామనామస్మరణతో మారుమ్రోగాయి. వివిధ పట్టణాలు, గ్రామాల్లో ర్యాలీలు, ఆలయాల్లో హనుమాన్ చాలీసాలు, ప్రత్యేక పూజలతో భక్తులు రామనామ స్మరణ నిర్వహించారు.


భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రులో హనుమంత వాహనంపై సీతా రామ లక్ష్మణ స్వామివార్లు

బాపట్ల జనవరి 22: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయం నుండి ప్రపత్త్యాంజనేయస్వామి దేవాలయం వరకు 54 కలశాలతో శోభాయాత్రనిర్వహించారు. నందిరాజుతోట గ్రామంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.మండలంలోని కొండుబొట్లపాలెం రామాలయంలో జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ దంపతులు పూజలు నిర్వహించారు. బాపట్ల పట్టణంలో యుకువలు జైశ్రీరాం అంటూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే శ్రీ శంకర విద్యాలయంలో సీతారాముల కళ్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని భీమావారిపాలెంలోని కోదండ రామాలయంలో పల్లకి సేవ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ జిట్టా ప్రమీలా రాణి తదితరులు కలిసి పల్లకిని ఊరేగించారు.

భట్టిప్రోలు: మండలంలోని ఐలవరం గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, భట్టిప్రోలు, పెదపులివర్రు, వెల్లటూరు గ్రామాల్లో శోభాయాత్రలు నిర్వహించారు.

రేపల్లె : పట్టణంలో రామభక్తులు జెండాలు చేతబూని జైశ్రీరామ్ జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో, గ్రామాల్లో రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు సీతారామలక్ష్మణస్వామిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొల్లూరు : జై భజరంగ దళ్ ఆధ్వర్యంలో శ్రీరామ శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక అయ్యప్ప స్వామి గుడి వద్ద నుంచి గ్రామ పురవీధుల్లో బైక్ ర్యాలీ రూపంలో శోభాయాత్రను అనంతభోగేశ్వర స్వామి వారి ఆలయం వరకు నిర్వహించారు.

వేమూరు : మండల పరిధిలోని జంపని గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయంలో సీతారామాంజనేయ భక్త సమాజం వారు రామ నామ పారాయణతో పాటు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. రామ కళ్యాణం, ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించారు. ప్రవాస భారతీయులు పండిత రొంపిచర్ల బట్టర్ వెంకట రమణాచార్యులు, అర్చకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు. చావలి గాజులవారి వీధిలోని తూర్పు రామాలయంలో పాలరాతి విగ్రహాల పునఃప్రతిష్ఠ నిర్వహించారు.

చుండూరు: అయోధ్యలో బలరాముని మందిరం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా మండల గ్రామాల్లో సోమవారం భక్తులు శ్రీరామ చిత్రపటం ఊరేగింపు, భజన కార్యక్రమాలు చేపట్టారు. చిన పరిమి, మోదుకూరు, చుండూరు, వలివేరు, యడ్లపల్లి, వేటపాలెం, మండూరు పరిసర గ్రామాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఏరాపటు చేసిన పెద్ద ఎలక్ట్రానిక్ తెరపై అయోధ్యలో శ్రీబాలరాముని ప్రతిష్ఠ కార్యక్రమాలను భక్తులు తిలికించారు. ఆలయం ముందు కోలాట భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.


బాపట్లలో శ్రీరామభక్తుల బైక్ ర్యాలీ


జంపని వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజలు


చుండూరులో శ్రీరామ నామ భజనలో భక్తులు..

విద్యుత్ సరఫరా నిలిపివేత

భట్టిప్రోలు, జనవరి 22 : మండలంలోని భట్టిప్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని పల్లెకోన ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్లెకోన ఫీడర్ పరిధిలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటుగా లైన్ల మరమ్మతుల నిర్వహణ కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సూరేపల్లి, కోనేటిపురం, పల్లెకోన, ఆళ్ళమూడి, రాచూరు గ్రామ పంచాయితీల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సదరు విషయాన్ని గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని ఏడుకొండలు కోరారు.


బాధితులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న శివప్రసాద్ తదితరులు

ఆపదలోవున్నవారికి అండగా టీడీపీ

● అగ్ని ప్రమాద బాధితులకు రూ.50 వేలు ఆర్థికసాయం

రేపల్లె, జనవరి 22: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు టీడీపీ ముందుంటుందని ఎమ్మెల్యే అనగాని సోదరుడు శివప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని 13వార్డు ఎస్టీ కాలనీలో ప్రమాదశాత్తు దగ్ధమైన గృహాలను సందర్శించి కుటుంబాలను పరామర్శించారు. ఈఅగ్ని ప్రమాదంలో ఐదు గృహాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఒక్కోక్క కుటుంబానికి రూ.10వేలు చొప్పున అందించిన నగదును శివప్రసాద్ బాధితులకు కుటుంబాలకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షులు గోగినేని పట్టాభిరామారావు, టీడీపీ నాయకులు పంతాని సాయికుమార్, కుంభా తిరుపతయ్య, హనుమంతు, మద్దుల అంకాలు, కొలసాని రాము, రేపల్లె సురేష్, దేవగిరి రవిశంకర్, పాల్గొన్నారు.

24న మండల పరిషత్ సమావేశం

పిట్టలవానిపాలెం, జనవరి 22 : పిట్టలవానిపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఈనెల 24న మధ్యాహ్నం 3గంటలకు ఎంపీపీ షేక్.బాజి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి భవనం మారుతి శేషమాంబ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసమావేశానికి మండలస్థాయి అధికారులు, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని ఆమె తెలిపారు.

వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు

● సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ

బాపట్లటౌన్, జనవరి 22 : వ్యవహారిక భాష(వాడుకబాష)ను ప్రవేశపెట్టటానికి గిడుగు రామమూర్తి అహర్నిశలు కృషి చేశారని, వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి అని సాహితిభారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ అన్నారు. సోమవారం గిడుగు రామమూర్తి 84 వర్ధంతి కార్యక్రమంలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫీ, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, డాక్టర్ శ్రీనివాస్, హిందీ పండితులు అబ్దుల్‌ఖాదర్ జిలానీలు మాట్లాడుతూ..ఆనాడు గ్రంథాలనీ గ్రాంథిక భాషలో ఉండట కారణంగా విషయ పరిజ్ఞానం పొందుట కష్టంగా ఉండేదని, గిడుగురామమూర్తి కృషితో ఆయా గ్రంథాలన్నీ నేడు వాడుకభాషలోకి తర్జుమా అయ్యాయని, దీంతో ఆయా పుస్తకాలను ప్రతి ఒక్కరు సునాయసంగా చదవి జ్ఞానార్జన చేయగలుగుతున్నారన్నారు. అనంతరం వారు గిడుగ రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.


కళాశాల అధ్యాపకులతో మాట్లాడుతున్న అమెరికా అధ్యాపకులు

ఆహార విజ్ఞాన కళాశాలను

సందర్శించిన అమెరికా అధ్యాపకులు

బాపట్ల,జనవరి 22 : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అమెరికాలోని టెనస్సీ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ దిలీఫ్ నంద్వాని, డాక్టర్ జాన్‌రికెట్స్‌లు సోమవారం బాపట్ల పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలను సందర్శించారు. ఆహార పదార్థాల యొక్క సంరక్షణను, పోషణతో కూడిన పదార్థాలు గురించి కళాశాల సిబ్బంది, విద్యార్థులు వారికి వివరించారు. కళాశాలలో నాల్గొవ సంవత్సరం విద్యార్థులు చేసిన కొన్ని పదార్థాలకు ముగ్దులై వాటికి ఆకర్షితులయ్యారు. కళాశాలలోని వివిధ పరిశోధనశాలలను సందర్శించారు. అసోసియేట్‌డీన్ డాక్టర్ వై.రాధ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సి.హెచ్ సోమేశ్వరరావు, డాక్టర్ విమల భీర, డాక్టర్ ఇ.గౌతమి, సౌజన్య, డాక్టర్ వై.శ్రీనివాస్, దశరథ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రహోమం, రథోత్సవం


గంగాపార్వతి సమేత అనంత భోగేశ్వరస్వామి

కొల్లూరు, జనవరి 22: గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వర స్వామికి రుద్ర హోమం, రథోత్సవం కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. సోమవారం కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో వార్షిక ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో భాగంగా స్వామి వారికి రుద్రహోమం నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించి గ్రామ పురవీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం జరిగిన అన్న సంతర్పణలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఆయా కార్యక్రమాలను ఆలయ కమిటీ ఛైర్మన్ యడ్ల వెంకటేశ్వరరావు, ఈవో మంతెన అనుపమ, పార్వతీ అమ్మవారి దేవస్థాన బ్రాహ్మణ సంఘం సభ్యులు పర్యవేక్షించారు.


మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

కొల్లూరు, జనవరి 22 : మాజీ సర్పంచ్ యార్లగడ్డ శ్రీనివాసరావు కుటుంబాన్ని మాజీ మంత్రి ఆనందబాబు పరామర్శించారు. సోమవారం మండల పరిధిలోని జువ్వలపాలెం గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు యార్లగడ్డ శ్రీనివాసరావుకు (బుజ్జి) అమ్మమ్మ అయిన బసవపూర్ణమ్మ అనారోగ్య సమస్యతో కన్ను మూసింది. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి, మండల పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావును అతని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతి తెలియజేశారు.

నేచరోపతి వైద్యవిద్యతో భవిష్యత్తుకు బాటలు

● ప్రముఖ ప్రకృతి వైద్యనిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు

● కేర్ యోగా నేచరోపతి మెడికల్ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సభలో మాట్లాడుతున్న డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు

పిట్టలవానిపాలెం,జనవరి 22 : గ్రామీణ ప్రాంతాలలో కేర్ యోగా నేచరోపతి వైద్యకళాశాల ఏర్పాటు చేసి ఎందరి విద్యార్థులకు భవిష్యత్తుకు బాటలు వేయటం ఎంతో అభినందనీయమని విజయవాడకు చెందిన ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పిట్టలవానిపాలెంలోని కేర్ యోగా నేచరోపతి మెడికల్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా నేచరోపతి మెడికల్ కోర్సును పూర్తి చేసుకున్న ప్రథమ బ్యాచ్‌కు విద్యార్థులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు చేతులమీదగా డాక్టర్ డిగ్రీ సర్టిఫికెట్‌ను అందజేశారు. కోర్సును పూర్తి చేసిన మొదటి బ్యాచ్‌కు కళాశాల వ్యవస్థాపకులు వేగేశన రాధాకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ వసంత లక్ష్మీ, కళాశాల సెక్రటరీ వేగేశన కిషోర్‌కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్ పండిట్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన బేతపూడి గ్రామస్థులతో వేగేశన నరేంద్రవర్మ

వైసీపీని వీడి టీడీపీలోకి ..

● వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో చేరికలు

బాపట్ల, జనవరి 22 : మండలంలోని తూర్పు పిన్నిబోయన వారిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ శ్రేణులు ఆ పార్టీని వీడి సోమవారం టీడీపీలో చేరారు. టీడీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే దళితులకు న్యాయం జరుగుతుందన్నారు. వైసీపీ అరాచక పాలనలో దళితులమీద అనేక దాడులు జరిగాయన్నారు. త్వరలో ఏర్పడబోయే టీడీపీ ప్రభుత్వంలో దళితులకు అన్నివిధాలా న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోట నారాయణరావు, మందపాటి ఆంద్రేయ, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, మాజీ కౌన్సిలర్ విజయ్‌కుమార్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బేతపూడిలో టీడీపీలో చేరిన 60 మంది..

మండలంలోని బేతపూడి గ్రామానికి చెందిన 60 మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వేగేశన నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండలపార్టీఅధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, పల్లం సరోజినీ, చెన్నుపాటి కిషోర్, కూచిపూడి ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.


పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు

వైసీపీని గద్దె దించడమే టీడీపీ, జనసేన లక్ష్యం

● పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి ఆనందబాబు

అమృతలూరు, జనవరి 22 : రాబోయే ఎన్నికల్లో ప్రజలను పీడిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే టీడీపీ, జనసేన పార్టీల లక్ష్యమని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రం అమృతలూరులో టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ, కొద్ది రోజుల్లోనే సార్వత్రిక ఎన్నికలు రాబోతున్నాయని, ఒక్కఛాన్స్ అంటూ మోసపూరిత వాగ్ధానాలు చేసి గద్దెనెక్కిన జగన్ రాష్ట్రాన్ని దోచుకోవడం, దాచుకోవడం తప్పా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయలేదని, పైగా మచ్చుకైనా రాష్ట్ర అభివృద్ధి జరగలేదన్నారు. అన్ని వనరులను ముఖ్యమంత్రితో పాటు ఎమ్మెల్యేలు, మంత్రులు దోచివేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. జగన్‌ను గద్దె దింపి బుద్ది చెప్పడమే టీడీపీ, జనసేన కార్యకర్తల లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ వారిలో చైతన్యం నింపాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు యలవర్తి బ్రహ్మానందం, వట్టిప్రోలు రవీంద్రబాబు, శరణు శేషగిరి, నాళం శ్రీను, ఆనంద్, తమ్మా శివారెడ్డి, కొసరాజు దేవకుమార్, జి. శాంతకుమారి, పాములపాటి సుబ్బారావు, బొరుగడ్డ శామ్యూల్, అచ్చన వెంకటేశ్వరరావు, బొల్లు రామేశం, యలవర్తి జగన్మోహనరావు, ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం సందర్భంగా సర్వమత ప్రార్థనలు చేశారు.

బీసీలకు వెన్నుదన్నుగా నిలిచిన టీడీపీ

● రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ అధికార ప్రతినిధి దివి రాంబాబు

చెరుకుపల్లి, జనవరి 22: రాష్ట్రంలో బీసీలకు వెన్నుదన్నుగా నిలిచిన పార్టీ టీడీపీ అని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ అధికార ప్రతినిధి దివి రాంబాబు అన్నారు. సోమవారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగే జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి టీడీపీ టౌన్ అధ్యక్షులు నాగుల పున్నారావు అధ్యక్షత వహించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలపై దాడులు చేసి 74 మందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. బీసీలకు అందించాల్సిన పథకాలను కూడా బీసీకులాలకు అందించలేదన్నారు. నామినేటెడ్ పదువులకు బీసీలకు ఇవ్వలేదని విమర్శించారు.టీడీపీ ప్రభుత్వం వస్తేనే బీసీలకు లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న ఎన్నికలలో బీసీలు అంతా టీడీపీకి అండగా ఉండి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు ఉప్పాల సాంబశివరావు, నియోజకవర్గ టీడీపీ నాయకులు జీ.నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఉయ్యూరు శివకృష్ణ, టీడీపీ నాయకులు దివి శ్రీనివాసరావు, కాటూరి నాగేశ్వరరావు, తాతా సీతయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను విమర్శించడం సిగ్గుచేటు

● వైసీపీ రేపల్లె ఇన్‌చార్జి డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి, జనవరి 22: ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌ను తెలంగాణా నుంచి ఆంధ్రాకు డిప్యుటేషన్‌పై వచ్చిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించడం విచారకరమని రేపల్లె వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ షర్మిల వ్యాఖ్యలు చూస్తుంటే ఎవరో రాసి ఇచ్చినట్లుగా ఉన్నాయని విమర్శించారు. షర్మిల మాట్లాడిన భాష, యాస అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. తెలంగాణాలో వైఎస్సార్ టీపీని స్థాపించి ప్రజలకు చేసిందేమిటో చెప్పాలన్నారు. వైఎస్ జగన్‌పై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

అభివృద్ధి పనుల్లో వివక్ష



పోడియం వద్దకు వెళ్ళి ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్ కంపా రజనీ

అద్దంకి, జనవరి 22: టీడీపీ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహించే వార్డులలో మూడు సంవత్సరాలుగా చిన్నపాటి అభివృద్ధి పనులు చేపట్టకుండా వివక్ష చూపిస్తున్నారని టీడీపీ కౌన్సిలర్‌లు ధ్వజమెత్తారు. అద్దంకి మున్సిపల్ సమావేశం సోమవారం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా టీడీపీ కౌన్సిలర్‌లు జహీరా, కంపా రజనీ మాట్లాడుతూ సమస్యల ప్రస్తావనకు జీరో అవర్ ఏర్పాటుచేయాలని ఎన్నిసార్లు అడిగినా ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. త్వరలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అన్ని వార్డులలో సమానంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. పట్టణంలో కనీసం పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ కూడా సరిగ్గా లేదన్నారు. పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు ఎదురుదాడికి సిద్ధం అవుతుండగా మాట్లాడే అర్హత వైసీపీ కౌన్సిలర్‌లకు లేదని, ఎమ్మెల్యే రవికుమార్ గతంలో సమావేశం కు హాజరైన సమయంలో గౌరవం ఇవ్వకుండా వ్యవహరించారని జహీరా ధ్వజమెత్తారు. అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలని కంపా రజనీ పోడియం వద్దకు వెళ్ళి చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. దీనికి స్పందించిన చైర్‌పర్సన్ అర్జీలు నేరుగా తనకు ఇస్తే అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుపై పరిశీలిస్తామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు పద్మేష్, అనంతలక్ష్మి, కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

అద్దంకి నియోజకవర్గంలో 2,41,081 మంది ఓటర్లు

అద్దంకి, జనవరి 22: అద్దంకి నియోజకవర్గంలో 2,41,081 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్ల వివరాలను సోమవారం అద్దంకి తహసీల్దార్ సుబ్బారెడ్డి తెలిపారు. పురుషులు 1,18,159 మంది కాగా, మహిళలు 1,22,910 మంది ఉన్నారు. 12 మంది థర్డ్ జండర్‌లు ఉన్నారు. అద్దంకి పట్టణంలో 14,961 మంది పురుషులు, 16,266 మంది మహిళలు, ఐదుగురు థర్డ్ జండర్‌లు ఉన్నారు. అద్దంకి రూరల్‌లో 19,370 మంది పురుషులు, 19,859 మంది మహిళలు, ఇద్దరు థర్డ్ జెండర్‌లు ఉన్నారు. సంతమాగులూరు మండలంలో 225,097 మంది పురుషులు, 25,560 మంది మహిళలు, నలుగురు థర్డ్ జెండర్‌లు ఉన్నారు. బల్లికురవ మండలంలో 21,672 మంది పురుషులు, 21,840 మంది స్త్రీలు, ఒకరు థర్డ్ జెండర్ ఉన్నారు. జె.పంగులూరు మండలంలో 18,986 మంది పురుషులు, 20,034 మంది మహిళలు, కొరిశపాడు మండలంలో 18,073 మంది పురుషులు, 19,351 మంది మహిళలు ఉన్నారు. అన్ని మండలాలలో పురుషులు కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

పర్చూరులో మహిళా ఓటర్లు ఆధిక్యం

పర్చూరు, జనవరి 22: పర్చూరు నియోజవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. సోమవారం ప్రకటించిన ఓటర్ల జాబితాలో నియోజకవర్గం మొత్తం ఓటర్లు 2,25,770 ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 110256, మహిళా ఓటర్లు 115508, థర్డ్ జండర్ ఆరుగురు ఉన్నారు. గత ఎన్నికల కంటే ఈసారి ఓటర్ల సంఖ్య కొంత తగ్గింది. రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా పర్చూరు నియోజవర్గంలో పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపునకు ఫాం-7 నమోదు కావటం చర్చనీయాంశంగా మారింది. ఓట్ల తొలగింపు విషయంలో అధికారుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఒక సీఐతోపాటు, ముగ్గురు ఎస్సైలపై సస్పెండ్ వేటు పడింది. ఎన్నికల కమిషన్ చర్యలతో అధికారులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్



మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రవికుమార్

బల్లికురవ, జనవరి 22: మండలంలోని కె.రాజుపాలెంలో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబసభ్యులను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. టీడీపీ కార్యకర్త పంతంగి మైనయ్య తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి గృహానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే, కొణిదెనలో ప్రభుత్వ ఉద్యోగి అయిన తాళ్లూరి విద్యాసాగర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. టీడీపీ కార్యకర్త నాగబైరు బ్రహ్మయ్య మనుమడు ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. పోతినేని శ్రీనివాసరావు తల్లి పున్నమ్మ మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నేతలు జాష్టి శ్రీరంగనాయకులు, చెరుకూరి రామంజనేయులు, తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, జనవరి 22: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ అన్నారు. మండలంలోని పెదగంజాం గ్రామంలో విజయలక్ష్మి మెడికల్ షాపు సహకారంతో కిమ్స్ హాస్పిటల్ వారు సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రామాంజనేయులు, వైద్య సిబ్బంది పలురకాల వ్యాధులకు సంబంధించిన 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించా రు. రోగ నిర్ధారణ జరిగిన 65 మందిని ఒంగోలు హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు రఫీ తెలిపారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ లత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలు మృతి

మార్టూరు, జనవరి 22: రోడ్డు దాటుతున్న అట్లూరి కోటేశ్వరమ్మ(64) అనే వృద్ధురాలిని లారీ ఢీకొనడంతో మృతి చెందారు. ఈసంఘటన సోమ వారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై అంబేడ్కర్ నగర్ ఎదురుగా చో టుచేసుకుంది. అంబేడ్కర్ నగర్‌కు చెందిన మృతురాలు కోటేశ్వరమ్మ, మరో ముగ్గురు మహిళలతో కలిసి యద్దనపూడి గ్రామంలోని చర్చికి ప్రార్థనకు వె ళ్లడానికి రోడ్డు దాటుతున్నారు. అదేసమయంలో గుంటూరు వైపు వెళుతు న్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలిన ముగ్గురు మ హిళలు ప్రమాదం నుండి తప్పించుకున్నారు. మృతురాలికి కుమారుడు, కు మార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి త రలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పంగులూరు, జనవరి 22: రోడ్డు ప్రమాదంలో యవకుడు మృతిచెందారు. ఈ ఘటన సోమవారం పంగులూరు సమీపంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. కొండమంజులూరుకు చెందిన చొప్పవరపు మోజెస్ (27) పంగులూరులో బంధువుల ఇంట జరిగిన ఓకార్యక్రమానికి హాజరయ్యాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం సాయంత్రం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. పంగులూరు సమీపంలో చప్టావద్ద వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు మోజెస్ అద్దంకిలోని పెట్రోల్ బంకులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతునికి భార్య రాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రేణంగివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటర్ల జాబితాలు సిద్ధం

బల్లికురవ, జనవరి 22: మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం ఓటర్ల జాబితాలను సచివాలయాలలో అందుబాటులో ఉంచినట్లు తహసీ ల్దార్ కె.రవిబాబు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో ఓటర్ల జాబితాలను బూత్ లెవల్ ఆఫీసర్లకు రవిబాబు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే అన్ని గ్రామాలలో ఉన్న సచివాలయాల నోటీస్ బోర్డులో ఓటర్ల జాబితాలను పెట్టాలన్నారు. ఏవైనా పొరపాట్లు జరిగితే వెంటనే ఓటర్లు బీఎల్వోలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఇన్‌చార్జ్ ఆర్ఐ అశోక్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యకరంగా ఉండాలి

చీరాలటౌన్, జనవరి 22: ప్రతి ఒక్కరికి సంతోషకరమైన ఆరోగ్యం అవసరమని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.సుధ పేర్కొన్నారు. రమేష్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో సోమవారం కోర్టు ప్రాంగణంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయవాదులకు బీపీ, షుగర్, కిడ్నీ, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించారు. ఈక్రమంలో న్యాయమూర్తి హాజరయి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ బాబు, న్యాయవాదులు పుల్లెల హరిబాబు, నిర్వాహకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం

» వైభవంగా శోభాయాత్ర

» ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చినగంజాం, జనవరి 22: మండల పరిధిలోని పలుగ్రామాల్లో రాములోరి శోభాయాత్రను సోమవారం వైభవంగా నర్వహించారు. అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో సీతారాముల కల్యాణం, శోభాయాత్రలు, అన్నదానాలు నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలో మందిర కమిటీ సభ్యులు, వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్వామి వార్లకు అభిషేకాలు, పుష్ప యాగం, హరేరామ సంకీర్తన, శోభాయాత్ర ను నిర్వహించారు. సోపిరాల గ్రామంలో సీతారాముల ఉత్సవమూర్తుల శోభాయాత్రను గ్రామ పురవీధులలో వైభవంగా జరిపారు. అడవీధిపాలెంలో సీతారాయుల చిత్రపటంతో గ్రామస్తులు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కడవకుదురులో వేంచేసియున్న సీతాలక్ష్మణహ నుమత్ సమేత కోదండరామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

అద్దంకిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు

అద్దంకి, జనవరి 22: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అద్దంకిలో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో తులసీదళంతో అర్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అద్దంకి పట్టణంలోని గీతామందిరంలో సీతారాముల విగ్రహాలకు అభిషేకం, అర్చన నిర్వహించారు. 27 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. రామనామ సంకీర్తన, రామయాగం నిర్వహించారు. కార్యక్రమంలో నాగసూరి హరి, నాగేశ్వరరావు, చామర్తి హనుమంతరావు, అర్వపల్లి హనుమంతరావు, లక్కరాజు చంద్రశేఖర్, తమ్మన శ్రీనివాసరావు, కొంజేటి సాయి, నాగసూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు. వేలమూరిపాడు రోడ్డులో పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఉసిర మొక్కలతో పాటు పలురకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో దొడ్డపునేని భాస్కరరావు, రాచమల్లు శివాంజనేయులు, మన్నం త్రిమూర్తులు, నర్రా శ్రీలక్ష్మి, కరి రామయ్య, నాగరాజకుమారి, గడ్డమడుగు ప్రసన్నాంజనేయులు, రాచమల్లు మోహనకృష్ణ, పేరం సుధాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో తులసిదళంతో అర్చన, పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పర్చూరులో రాముని చిత్రపటాలతో గ్రామోత్సవం



మార్టూరు: గన్నవరంలో జరిగిన శోభా యాత్రలో పాల్గొన్న భక్తులు

ఆలయాల్లో భక్తుల సందడి

మార్టూరు, జనవరి 22: మండలంలోని తాటివారిపాలెం కోదండరా మాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మార్టూరులోని తూర్పు బజారున యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. రాత్రి మహిళలు కోటి దీపోత్సవం చేశారు. రాత్రి సమయంలో మహిళలు ఇంటిముందు దీపాలను వెలిగించారు. యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో సోమవారం రాత్రి భక్తులు సీతా రామచంద్ర స్వామి శోభా యాత్ర నిర్వహించారు.

ఇంకొల్లు: అయోధ్యలో బాలరాముడు ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో ప్రతేక పూజలు నిర్వహించారు. ఇంకొల్లు రామమందిరంలో సప్తాహం, నాగులచెరువుకట్ట వద్ద అభయాంజనేయస్వామి దేవాలయంలో ఏకాహం నిర్వహించారు. పలు దేవాలయాల్లో భక్తులు నిర్విరామంగా భజనలు చేశారు.

కన్నుల పండువగా రాములవారికి పూజలు

చీరాల జనవరి 22 : అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా స్థానిక పట్టాభి స్వీట్స్ సమీపంలో సోమవారం యూత్ ఆధ్వర్యంలో రాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావన ప్రతి ఒక్కరికి అవసరమన్నారు.

అలాగే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆయన కుమారుడు గౌరీ అమర్నాథ్ రాములు వారికి ప్రత్యేక చేశారు.. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ భక్తి భావంతో ఉండాలన్నారు. పూజలు అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పర్చూరు: రామనామ స్మరణ గ్రామగ్రామాన మార్మోగింది. సోమవారం శ్రీరాముని చిత్రపటాలు, జెండాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని, కోలాట భజన కార్యక్రమాలు నిర్వహించారు. రామనామ స్మరణలతో గ్రామాలు మార్మోగాయి.

కార్యక్రమంలో భాగంగా పర్చూరులోని శ్రీఅద్దంకి నాంచారమ్మ సేవా మండలి ఆధ్వర్యంలో పెద్దఎత్తున గ్రామోత్సం నిర్వహించారు.

వేడెక్కిన రాజకీయం

» చీరాలలో వెంకటేష్, తాడేపల్లిలో ఆమంచి » అద్దంకిలో టీడీపీలోకి వలసలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

చీరాల, అద్దంకి నియోజకవర్గాల్లో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. చీరాలలో అధికార వైసీపీ సాధి కార బస్సు యాత్ర నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే, పర్చూరు ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ తాడేపల్లి వెళ్లి రాష్ట్ర నేతలతో మంతనాలు నిర్వహించడం గమనార్హం. బస్ యాత్రలో పాల్గొన్న రాష్ట్ర నేతలు చీరాల వైసీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కరణం వెంకటేష్‌ను గెలిపించాలని కోరగా, తాడేపల్లి వెళ్లిన ఆమంచి చీరాల బీసీ అభ్యర్థికి ఇవ్వాలని పట్టుబట్టడం గమనార్హం. మరోవైపు అద్దంకి నియోజకవర్గంలో వైసీపీకి చెందిన కొందరు నేతలు, పలువురు ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. దీంతో రెండు నియోజకవర్గాల్లో రాజకీయం వేడెక్కింది. చీరాల ఎమ్మెల్యే బలరాం కుమారుడు వెంకటేష్ ప్రస్తుత వైసీపీ ఇన్‌చార్జిగా ఉండగా అతని కోసం ఆపిన బస్ యాత్రను సోమవారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో మోకాలిదెబ్బతో వైద్యశాలలో ఉన్న వెంకటేష్ కోసం బస్ యాత్రను ఆపి అయన వచ్చాక సోమవారం నిర్వహించారు. బస్‌యాత్రలో పోటీ చేసే అభ్యర్థులపై వైసీపీ అధిష్ఠానం స్పష్టత ఇస్తున్న విషయం విదితమే. తదనుగుణంగా సోమవారం బస్ యాత్రలో వెంకటేష్ పేరును అధిష్ఠానం ప్రకటిస్తున్న విషయం ముందుగానే వెల్లడైంది. దీంతో ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న చీరాల మాజీ ఎమ్మెల్యే, పర్చూరు వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి హడావుడిగా సోమవారం మధ్యాహ్నం తాడేపల్లి చేరారు. అక్కడ ఆయన ఆ పార్టీ ముఖ్య నేతలు సజ్జల, విజయసాయిరెడ్డితో పాటు సీఎంవో ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డిని కూడా కలిసినట్లు తెలిసింది.

చీరాల అభ్యర్థిగా కరణం వెంకటేష్ పేరును ప్రకటించొద్దని డిమాండ్‌ను ఆయన వారి ముందు ఉంచినట్లు సమాచారం. తనకు చీరాలలో బీసీ అభ్యర్థికి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యే బలరాం ఆయన కుమారుడికి అద్దంకిలో అవకాశం ఇస్తామని చెప్పాకే తాను పర్చూరు పార్టీ బాధ్యతలు చేపట్టానని ఆమంచి వారితో అన్నట్లు తెలిసింది. అందువల్ల బస్‌యాత్ర సభలో చీరాల వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్‌ను అభ్యర్థిగా ప్రకటించవద్దని కోరినట్లు సమాచారం. రాత్రి పొద్దుపోయే వరకు ఆయన సీఎంవో వద్దే వారితో మంతనాలు జరుపుతున్నారు. అదే సయమంలో చీరాలలో జరిగిన బస్‌యాత్ర సభలో పాల్గొన్న నేతలు చీరాల నుంచి కరణం వెంకటేష్ పోటీ చేస్తారని, ఆయన్ను గెలిపించాలని స్పష్టమైన ప్రకటన చేశారు. మంత్రి మేరుగ నాగార్జునతోపాటు ఎంపీ మోపిదేవి వెంకటరమణ, బాపట్ల ఎంపీ నందిగామ సురేష్‌లు వారి ప్రసంగాల్లో చీరాలలో వెంకటేష్‌ను గెలిపించాలని రాష్ట్రంలో మళ్లీ జగన్ సీఎం కావాలని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పార్టీ అధిష్ఠానం ఇక్కడ విస్పష్ట ప్రకటన చేయడం గమనార్హం.

కాగా అద్దంకి నియోజకవర్గంలో పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. సంతమాగులూరు మాజీ ఎంపీపీ అట్లా చినవెంకటరెడ్డితోపాటు ఆ పార్టీకి చెందిన తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు, 12మంది సర్పంచ్‌లు టీడీపీలో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు వారంతా సోమవారం రాత్రి జొన్నతాళి వద్ద అద్దంకి టీడీపీ ఎమ్మెల్యే రవికుమార్‌తో మంతనాలు జరిపారు. త్వరలో వారందరూ చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరబోతున్నట్లు సమాచారం. వైసీపీ నేతలు తమకు పట్టు ఉందని భావిస్తున్న సంతమాగులూరు మండలం నుంచి టీడీపీలోకి వలసలు ప్రారంభం కావడంతో ఆ నియోజకవర్గంలోనూ రాజకీయ వాతావరణం వేడెక్కింది.

బీసీలను మోసం చేసిన వైసీపీ

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



టీడీపీలో చేరిన నాగరాజుపల్లికి చెందిన కుటుంబాలు

మార్టూరు, జనవరి 22: కల్లబొల్లి మాటలతో బీసీలను వంచించి, మోసం చేసి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో మార్టూరు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల బీసీ నాయకులతో జయహో బీసీ సదస్సును ఏర్పాటుచేశారు. ఈ సదస్సుకు నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఏలూరి మాట్లాడుతూ బీసీలను నమ్మకద్రోహం చేసిన జగన్‌ను ఇంటికి పంపించడానికి అందరూ నడుంబిగించాలన్నారు. బీసీలకు రాజ్యాంగ పదవులు లభించకూడదనే దురుద్దేశంతో స్థానిక సంస్థలలో ఉన్న 24 శాతం రిజర్వేషన్ శాతాన్ని పది శాతానికి తగ్గించిన ప్రభుత్వానికి బీసీల సత్తా చూపించాలన్నారు. తొలుత జయహో బీసీ వాహనాలను ఏలూరి జండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌతవరపు జనార్దన్, గుంజి వెంకట్రావు, కోడూరు శేషబ్రహ్మాచారి, నక్కల రాఘవ, సింగయ్య, రామాంజనేయులు, షేక్ రజాక్, వాసు, రామాంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పది కుటుంబాలు చేరిక

మార్టూరు, జనవరి 22: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే యానాదుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం ఇసుకదర్శిలోని క్యాంపు కార్యాలయంలో మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన పది యానాది కుటుంబాలు టీడీపీలో చేరారు. వారందరికి ఏలూరి పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే వారి సంక్షేమం కోసం మరిన్ని అభివృద్ధి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వెల్లంపల్లి అంకమ్మరావు, బుదురి పవన్, పొట్లూరి ఏసుదాసు, రాపూరి దుర్గాప్రసాద్, బుధూరి మహేంద్ర, విజయ్‌కాంత్, నాగరాజుపల్లి గ్రామ టీడీపీ నాయకులు మిన్నెకంటి రవికుమా ర్, సోమ్లా నాయక్, రాజానాయక్, రాముడునాయక్ పాల్గొన్నారు.

అలాగే, మార్టూరు గ్రామానికి చెందిన వైసీపీ యువనేత పుట్టా అయ్యప్ప స్వామి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయన సతీమణి నవ్య 17వ వార్డు మెంబరుగా కొనసాగుతున్నారు. ఆయనకు ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. నియోజకవర్గ అభివృద్ధికి, సంక్షేమానికి ఏలూరి కష్టపడి పనిచేసేతీరు నచ్చడంతో పార్టీలో చేరినట్లు అయ్యప్ప స్వామి తెలిపారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, షేక్ రజాక్, కామినేని జనార్దన్, కమ్మ శివనాగేశ్వరరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

పర్చూరు, జనవరి 22: జనసేన, తెలుగుదేశం పార్టీ సమన్వయంతో పనిచేసి నిరంకుశ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించి అధికారం సాధిస్తామని జనసేన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ కన్వీనర్ ఆలా అనిల్ కుమార్ అన్నారు. కేంద్ర ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సోమవారం పర్చూరులోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధి కుంటుపడిందన్నారు. పార్టీ శ్రేణులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జనసేనులు కారంపూడి తేజ, పద్మ, తరుణి గోపాల కృష్ణ, తులసి భాస్కర్, తులసి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను తొలగిస్తే మూల్యం చెల్లించక తప్పదు!

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హెచ్చరిక

» అక్రమ అరెస్టులపై ధ్వజం



మార్టూరు పోలీస్ స్టేషన్ వద్ద పోలీసుల అదుపులో అంగన్‌వాడీలు

బల్లికురవ, జనవరి 22: ఎన్నికలకు ముందు వైసీపీ ఇచ్చిన హామీలను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను అక్రమ మార్గంలో తొలగిస్తే ఈ ప్రభుత్వానికి తగిన మూల్యం తప్పదని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు. సోమవారం బల్లికురవ మండలం కె.రాజుపాలెం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళ్లిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను అన్యాయంగా మగ పోలీసులచే అరెస్టు చేయించి బస్సులలో రోడ్లపై తిప్పటం అనాగరిక చర్య అని అయన విమర్శించారు. ధర్నా చౌక్ వద్ద అంగన్ వాడీ కార్యకర్తలు చేస్తున్న దీక్షను అర్ధరాత్రి భగ్నం చేయటం హేయమైన చర్య అని అన్నారు. అంగన్‌వాడీలకు మద్దతుగా ప్రజల నుండి సేకరించిన కోటి సంతకాలతో వస్తున్న వారిని అడ్డుకోవడం పిరికి పంద చర్య అని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు అబద్ధపు హామీలు ఇచ్చి చిరు ఉద్యోగులను తీవ్రంగా మోసం చేశారని చెప్పారు. ఇప్పుడు మాట తప్పటంతో పాటు వారిని చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ ప్రభుత్వంపై అన్ని వర్గాలలో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ప్రశ్నిస్తే కేసులు, ఉద్యమిస్తే కక్షసాదింపు చర్యలకు పాల్పడుతూ ఎమర్జెన్సీని తలపించేలా వైసీపీ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఎమ్మెల్యే రవికుమార్ ధ్వజమెత్తారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి బదులు రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం హిట్లర్ పాలనను తలపిస్తోందని అయన ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేస్తున్న సమ్మె న్యాయబద్ధమైనదని, వారికి టీడీపీ అండగా ఉంటుందని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రాగానే వారి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

బల్లికురవ, జనవరి 22: తమ సమ్మెపై ప్రభుత్వం పట్టించుకోవటం లేదని సోమవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టారు. అక్కడికి వెళ్లేందుకు సిద్ధపడగా పోలీసులు అరెస్టు చేసి బల్లికురవ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. ఎన్నిరకాల బెదిరింపులకు గురిచేసిన తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. కేంద్రాలను తెరవాలని చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నేతలు శ్రీదేవి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.


చినగంజాం: మండలంలో సీఐటీయూ నాయకుడిని, పులువురు అంగన్‌వాడీ కార్యకర్తలకు నోటీసులు జారీచేసి ఆదివారం అర్ధరాత్రి చినగంజాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తలపెట్టిన ధర్నాకు అనుమతి లేదంటూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్‌కు, చినగంజాం, సోపిరాలకు చెందిన పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలకు పోలీసులు నోటీసులు అందజేసి అదుపులోకి తీసుకున్నారు. తాము విధుల్లో చేరుతున్నామని కార్యకర్తలు పోలీసులకు తెలపడంతో సోమవారం ఉదయం విడుదల చేశారు.

మార్టూరు: అంగన్‌వాడీలు సోమవారం విజయవాడలో జరిగే ధర్నాకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. మార్టూరు సమీపంలో గుంటూరు వైపు రెస్ట్ ఏరియా వద్ద జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. విజయవాడకు కారులో వెళుతున్న మండలంలోని ఆరుగురు అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే, మరికొంత మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. యద్దనపూడి మండలంలోని కార్యకర్తలు విజయవాడ ధర్నాకు వెళ్లగా అక్కడ వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. విజయవాడలో సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావును కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

చీరాలటౌన్: తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుండగా అరెస్ట్ చేయడం అన్యాయమని పలువురు అంగన్‌వాడీలు పేర్కొన్నారు. సోమవారం విజయవాడలో తలపెట్టిన కార్యక్రమం అడ్డుకునేందుకు గాను చీరాల పట్టణ, రూరల్ పరిధిలో పలువురు కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. అయినా అధిక సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు అరెస్ట్‌లు లెక్కచేయకుండా ముందుగానే విజయవాడకు చేరకుని కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైసీపీ చీరాల అభ్యర్థి వెంకటేష్!

» స్పష్టం చేసిన మంత్రి మేరుగ, ఎంపీలు నందిగం, మోపిదేవి



మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున, పక్కన కరణం వెంకటేష్

చీరాల జనవరి 22: వచ్చే ఎన్నికల్లో వైసీపీ చీరాల అభ్యర్థి కరణం వెంకటేషేనని ఆపార్టీ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని అన్నారు. సీఎం జగన్ మాటిస్తే తప్పరని అన్నారు. చీరాలలో వెంకటేష్‌ను ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా మరలా జగన్ వచ్చేందుకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలని మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.వరికూటి అమృతపాణి స్పష్టం చేశారు. వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా సోమవారం సాయంత్రం చీరాల గడియారస్తంభం సెంటర్‌లో వెంకటేష్ అధ్యక్షతన సభ జరిగింది. ఈసందర్భంగా మేరుగ, నందిగం, మోపిదేవి తదితరులు మాట్లాడుతూ వైసీపీ చీరాల అభ్యర్థిగా ఎవరో వస్తారని, ఏదో జరుగుతుందన్న ప్రచారాలను నమ్మవద్దన్నారు. వీటిల్లో ఎటువంటి నిజం లేదని గ్రహించాలన్నారు. జిల్లా రాజకీయాల్లో వెంకటేష్ ప్రభావం అత్యంత కీలకంగా ఉంటుందన్నారు. నమ్మినవారి కోసం పనిచేసే వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ పోతుల సునీత, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర తదితరులు మాట్లాడుతూ 175 స్థానాలకు 175 స్థానాలు గెలిపించుకునే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కలసి పని చేయాలన్నారు. ముందుగా హాజరయిన ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించా రు. ఆ తరువాత ఆయన సభలో పాల్గొనలేదు. కాలికి తగిలిన దెబ్బతో కట్టుతోనే వాకర్ సహాయంతో స్టేజీ ఎక్కిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అధ్యక్షతన సభ కొనసాగింది. వెంకటేష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చీరాల నుంచి గెలిచి జగన్‌కు కానుక ఇచ్చేందుకు ఎంత దూరమైనా వెళతామన్నారు. ముందుగా కౌన్సిలర్ బత్తుల అనీల్ ఆహుతులకు ఆహ్వానం పలికారు.